క్లుప్తంగా

వెండితాపడం తయారీకి విరాళం



పెనుగంచిప్రోలు:గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో అంకమ్మవారి ఉపాలయం గోపురం వెండితాపడం తయారీకి శనివారం తుళ్లూరు మండలం నెక్కలు గ్రామానికి చెందిన కొమ్మినేని శ్రీదీప్తి రూ.10,120లు విరాళంగా అందజేశారు. ఆలయ డైరక్టర్ బెజవాడ శ్రీనివాసరావు చేతుల మీదుగా నగదును అందజేశారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు

నేడు ఉచిత వైద్యశిబిరం

పెనుగంచిప్రోలు: స్థానిక సింగవరంరోడ్డులోని స్ఫూర్తి యానివర్స్ స్థలంలో స్ఫూర్తి కుటుంబం గ్లోబల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యపరీక్షలతోపాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని వివరించారు. ప్రజలు ఈ వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

నేడు రిటైర్డ్ ఎంప్లాయిస్ జిల్లా సమావేశం

కంచికచర్ల : స్థానిక పెన్షనర్స్ సేవాభవన్ కార్యాలయంలో ఆదివారం ఉదయం 10గంటలకు జిల్లా సాధారణ సమావేశం జరుగుతుందని సంఘ అధ్యక్షుడు సానె రామ్మోహనరావు శనివారం తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా రిటైర్డ్ ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్ష్యులు పీఎస్ఎస్ఎన్‌పీ శాస్త్రీ, రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఐ.లక్ష్మీనారాయణ, రాష్ట్ర కోశాధికారి పీ నాగరాజు, జిల్లా ట్రెజరర్ పీ రమణారావు, రాష్ట్ర అసోసియేట్ ప్రసిడెంట్ కేఎస్ హనుమంతరావు, జిల్లా అధ్యక్షులు బీ లోవకుమార్ తదితరులు హాజరుకానున్నారని వివరించారు. కంచికచర్ల, వీరులపాడు మండలాల్లోని రిటైర్డ్ ఉద్యోగులంతా సమావేశానికి తప్పనిసరిగా రావాలని ఆయన కోరారు.

వాహనాల తనిఖీ

కంచికచర్ల : వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని ఎస్ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. స్థానిక నెహ్రూ బొమ్మసెంటర్‌లో శనివారం సాయంత్రం ఆయన వాహనాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పరిమితికి మించి అతివేగంగా, మద్యం సేవించి వాహనాలను నడుపరాదన్నారు. వాహనానికి సంబంధించిన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఎటువంటి పత్రాలు అందుబాటులో లేకపోవడంతో 25మంది వాహనదారులకు కలిపి రూ.3వేలు జరిమానా విధించారు. తనిఖీల్లో కానిస్టేబుళ్లు ఉపేంద్ర, రోజారావు, కార్తీక్ పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల నాయకులతో ఆర్డీవో సమీక్ష



నందిగామ: పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్డీవో ఎ.రవీంద్రరావు శనివారం అన్ని రాజకీయపక్షాల నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గ పరిధిలోని అన్ని పోలింగ్‌కేంద్రాల వివరాలను వారికి తెలియజేశారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు రాజకీయపక్షాలన్నీ సహకరించాలని ఆయన కోరారు.

పంటల బీమా జాబితాపై సామాజిక తనిఖీ



వేదాద్రి(జగ్గయ్యపేట): రైతులు విధిగా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఏ భవాని సూచించారు. గ్రామంలోని సచివాలయంలో 2023-24 పంట కాలానికి సంబంధించి ఈక్రాప్ చేసిన రైతు జాబితా సామాజిక తనిఖీ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల ఒకటి నుంచి మూడు వరకు మండలంలోని అన్ని గ్రామాలలో ఈ క్రాప్ చేసిన సామాజిక తనిఖీ గ్రామసభలు నిర్వహిస్తారన్నారు. రైతులు జాబితాను పరిశీలించుకుని అభ్యంతరాలను ఈనెల ఐదు లోపు అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో వరలక్ష్మి, , వీఏఏలు ఫణి తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు నైపుణ్యాలు పెంచుకోవాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యార్థులు చదువుతో పాటు వివిధ నైపుణ్యాలు పెంచుకోవాలని అమరావతి బోటింగ్ క్లబ్ సీఈఓ తరుణ్ కాకాని అన్నారు. నలంద డిగ్రీ కళాశాల మేనేజ్‌మెంట్ మీట్ స్పార్కిల్ 2కే 24 కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ, హెచ్ఓడీ వై.శ్రీలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం జగనన్నతోనే సుపరిపాలన



వేదాద్రిలో సచివాలయం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న విప్ ఉదయభాను



మత్స్యకారులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న ఉదయభాను

వేదాద్రి(జగ్గయ్యపేట): రాష్ట్రప్రజలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారా సుపరిపాలన అందుతోందని జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను కొనియాడారు. మండలంలోని వేదాద్రిలో రూ.76 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా విప్ ఉదయభాను మాట్లాడుతూ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల ఇళ్ల ముంగిటకే పాలనను తీసుకువచ్చారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను కూడా పూర్తిస్థాయిలో నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నిత్యం ప్రజలలో ఉండే నాయకులకే ప్రజల ఆదరాభిమానాలుంటాయని పేర్కొన్నారు. అభివృద్ధి పనులను అడ్డుకోవడం ప్రతిపక్ష నాయకులకు పరిపాటిగా మారిందని ఎద్దేవా చేశారు.

మత్స్యకారులకు గుర్తింపు కార్డులు..

గ్రామంలోని మత్స్యకారులు సొసైటీ సభ్యులకు మత్స్యశాఖ జారీచేసిన గుర్తింపు కార్డులను విప్ ఉదయభాను పంపిణీ చేశారు. ప్రభుత్వం కూడా మత్స్యశాఖ ద్వారా రాయితీపై బోట్లు, వలలు అందిస్తోందని వివరించారు. సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని మత్స్యకారులకు సూచించారు. అనంతరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు శీలం నాగరాజు టీడీపీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. నాగరాజుకు విప్ ఉదయభాను పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో సర్పంచి గుడారు పేరయ్య, పార్టీ మండల కన్వీనర్ మండవ శ్రీనివాస్‌గౌడ్, నెడ్‌కాప్ చైర్మన్ వేల్పుల రవికుమార్, ఏఎంసీ వైస్ చైర్మన్ శేషయ్య, నాయకులు పోతుమర్తి స్వామి, మువ్వా రాము, బాణావత్ సైదులు, తూమాటి నాగేశ్వరరావు, ఏడీఏ భవానీ, డీఈ కిరణ్, ఏఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ



వత్సవాయిలో ర్యాలీలో పాల్గొన్న వైద్యసిబ్బంది



చందాపురంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్యశాఖ సిబ్బంది



జగ్గయ్యపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ నాగరాణి, వైద్యసిబ్బంది

వత్సవాయి : మండలంలోని చిన్నారులందరికీ ఆదివారం పోలియో చుక్కలు వేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు వైద్యాధికారులు సుష్మాప్రియదర్శిని హర్షిదాబేగం తెలిపారు. పల్స్ పోలియోపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వత్సవాయిలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ మండలంలో మొత్తం 3726మంది చిన్నారులు ఉన్నారని, వీరందరికీ పోలియోచుక్కలు వేసేందుకు 33 పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వారు వివరించారు. సూపర్‌వైజర్ పర్యవేక్షణలో ఒక్కో కేంద్రంలో నలుగురు సిబ్బంది ఉండి చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తారన్నారు. తల్లిదండ్రులు ఐదేళ్లలోపు తమ చిన్నారులకు తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఉషారాణి, జవహర్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో ఆదివారం జరగనున్న పల్స్ పోలియా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ని ప్రభుత్వాస్పత్రి పీపీ యూనిట్ వైద్యాధికారి డాక్టర్ నాగరాణి పేర్కొన్నారు. పీపీ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం పల్స్ పోలియో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ నాగరాణి మాట్లాడుతూ పట్టణంలోని 2197మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసేలా 23 పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కఠారి హరిబాబు, వైద్యులు వాసంతి, అనూషా, షైల, హెల్త్ విజిటర్ జానకి, సిబ్బంది పాల్గొన్నారు.

నందిగామలో..

నందిగామ: మండలంలోని చందాపురంలో ఆరోగ్యశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం పల్స్ పోలియో కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. చిన్నారులకు ఆదివారం పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులను కోరారు. ఆరోగ్యశాఖ సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సెకండియర్ పరీక్షలకు 1816 మంది హాజరు

నందిగామ: ఇంటర్ సెకండియర్ పరీక్షలు శనివారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. నందిగామలో ఏర్పాటు చేసిన ఏడు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 1852మంది విద్యార్థులకుగాను 1816మంది పరీక్షలకు హాజరయ్యారు.36 మంది విద్యార్థులు గైర్హజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన మౌలికవసతులు కల్పించారు.

కంచికచర్లలో..

కంచికచర్ల : ఇంటర్ సెకండియర్ పరీక్షలు కంచికచర్లలో శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. కంచికచర్ల మండల పరిధిలో నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారని కస్టోడియన్ అధికారి వాసుదేవరావు తెలిపారు. నాలుగు పరీక్షా కేంద్రాల్లో కలిపి 762మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 36మంది గైర్హాజరైనట్లు ఆయన వివరించారు. కంచికచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్షా కేంద్రంలో 168మంది, ఇమ్మాక్యులేటివ్ డిగ్రీ కళాశాలలో 139మంది, దీక్షా డిగ్రీ కళాశాలలో 185మంది, కీసర బీజేటీ డిగ్రీ కళాశాలలో 270మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ఆయా పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరిండింటెంట్లు జయప్రకాష్, పద్మజ, రత్నకుమారి, తిరపతిరావు తెలిపారు.

ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ పట్టాలు అందజేత

వీరులపాడు:ఇళ్ల స్థలాలు అందించడమే కాకుండా ఆస్థలాలను రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వెల్లంకి సర్పంచి హుసేన్‌బీ కొనియాడారు. మండలంలోని వెల్లంకి గ్రామ సచివాలయం వద్ద ప్రభుత్వం మంజూరైన ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ పట్టాలను శనివారం ఆమె లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సర్పంచి మాట్లాడుతూ గ్రామంలోని 80 మంది లబ్ధిదారుల ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చినట్లు వివరించారు. ఎంపీటీసీ వేమిరెడ్డి కోటేశ్వరి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసే వారికి సముచిత స్థానం

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



బొమ్మిశెట్టిని సత్కరించి అభినందిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



ఎమ్మెల్సీ అరుణకుమార్‌ను సత్కరించి కృతజ్ఞతలు తెలుపుతున్న బొమ్మిశెట్టి తదితరులు

నందిగామ టౌన్: వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అభివృద్ధికి కృషి చేసే నాయకులకు పార్టీలో సముచిత స్థానం లభిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన బొమ్మిశెట్టి భాస్కరరావు స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి తన నియామకానికి సహకరించారంటూ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ అరుణకుమార్ మాట్లాడుతూ నరసింహారావుపాలెం గ్రామానికి చెందిన బొమ్మిశెట్టి భాస్కరరావు పార్టీకి అందిస్తున్న సేవలను గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయనను కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించారన్నారు. బొమ్మిశెట్టి భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పార్టీ కోసం పనిచేసిన వారిని అగ్రనాయకత్వం గుర్తించి, వారికి సముచితస్థానం కల్పిస్తారనేందుకు బొమ్మిశెట్టి నియామకం నిదర్శమని పేర్కొన్నారు. పార్టీ అభివృద్ధికి పనిచేసే వారందరికీ భవిష్యత్‌లోనూ తగిన పదవులు లభిస్తాయని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు భాస్కరరావును ఘనంగా సత్కరించారు. అనంతరంబొమ్మిశెట్టి భాస్కరరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, తన నియామకానికి కృషిచేసిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు రుణపడి ఉంటానని తెలిపారు. కార్పొరేషన్ డైరెక్టర్‌గా తనవంతు బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానని వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, నాయకులు గుడివాడ సాంబశివరావు, వైఎస్ఎన్ ప్రసాద్, నెలకుదిటి శివనాగేశ్వరరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక సంఘం నిధులు రూ.1.04కోట్లు విడుదల



నవాబుపేట సచివాలయం

పెనుగంచిప్రోలు: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు పుష్కలంగా అందిస్తోంది. ఈ నిధులను సద్వినియోగం చేసుకుంటే నెలాఖరుకు మరిన్ని నిధులు విడుదల చేయనుంది. తాజాగా గ్రామాల అభివృద్ధికి 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయి. పెనుగంచిప్రోలు మండలంలోని 15 గ్రామ పంచాయతీలకు కలిపికి రూ.1.03,99,435 విడుదలయ్యాయి. ఇందులో టైడ్ నిధులు రూ.62,40,501 ఉండగా, బేసిక్ నిధులు 41,58,934 ఉన్నాయి. ఈ నిధులతో ప్రధానంగా గ్రామాల్లో పారిశుధ్య పనుల నిర్వహణ చేపట్టవచ్చు. ప్రస్తుతం వేసవి సీజన్ కావటంతో గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా, ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందించేందుకు ఈ నిధులతో ప్రణాళికలు రూపొందించుకోవాలి. గ్రామ పంచాయతీల్లో సీసీరోడ్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు 15వ ఆర్థిక సంఘం నిధులు ఖర్చు చేయగలిగితే మార్చి నెలాఖరుకు మరోవిడత నిధులు విడుదల అయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. 15వ ఆర్థికసంఘం నిధులను సద్వినియోగం చేసుకుంటే ఈ నెలాఖరులోగా మరోసారి నిధులు విడుదల అయ్యే అవకాశం ఉందని ఎంపీపీ మార్కపూడి గాంధీ తెలిపారు. ప్రస్తుతం వచ్చిన ఆర్థిక సంఘం నిధులతో గ్రామాల్లో వేసవిలో తాగు నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవడంతోపాటు పారిశుధ్య పనులు చేపట్టాలని ఎంపీడీవో హర్ష సాయి సూచించారు.

గ్రామం	విడుదలైన నిధులు (రూ.లక్షల్లో)
1.అనిగండ్లపాడు	రూ.12,57,517
2.గుమ్మడిదుర్రు	రూ. 6,26,919
3.కొళ్లికూళ్ల	రూ. 2,82,016
4.కొణకంచి	రూ. 6,95,801
5.లింగగూడెం	రూ. 3,62,520
6.ముచ్చింతాల	రూ. 5,13,208
7.ముండ్లపాడు	రూ. 6,83,775
8.నవాబుపేట	రూ. 9,61,381
9.పెనుగంచిప్రోలు	రూ.28,45,398
10.శనగపాడు	రూ. 5,42,316
11.శివాపురం	రూ. 3,54,321
12.సుబ్బాయిగూడెం	రూ. 3,34,337
13.తోటచర్ల	రూ. 4.07,518
14.వెంగనాయకునిపాలెం	రూ. 2,50,141
15.వెంకటాపురం	రూ. 2,82,267
మొత్తం	రూ.1,03,99,435

పోలింగ్ కేంద్రాల పరిశీలన

వీరులపాడు:మండలంలోని పొన్నవరం, తాటిగుమ్మి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ రాజకిషోర్ శనివారం పరిశీలించారు. ఎన్నికల సందర్భంగా సిబ్బంది నిబంధనల మేరకు నడుచుకోవాలని బీఎల్వోలకు సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలికవసతులు కల్పిస్తున్నట్లు వివరించారు.

కూడలి తిరునాళ్ల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను

నందిగామ: కూడలి తిరునాళ్లను విజయవంతం చేసేందుకు అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను సూచించారు. ఈనెల 7 నుంచి ప్రారంభం కానున్న కూడలి సంగమేశ్వరస్వామి తిరునాళ్ల మహోత్సవాల పోస్టర్‌ను శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ తిరునాళ్లకు వచ్చే భక్తులకు అవసరమైన అన్నివసతులు కల్పించాలని, ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. అత్యవసర సర్వీసుల శాఖలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఎండల తీవ్రత పెరుగుతున్నందున మంచినీటికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, స్వామి వారి దర్శనం కోసం బారులు తీరే భక్తులకు నీడనిచ్చేందుకు షామియానాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆలయ పాలకవర్గ చైర్మన్ కనగాల వెంకటేశ్వరరావు,ఆలయ ఈవో భూపాల్, ఆలయ అర్చకుడు దాములూరి శ్రీనివాసశర్మ, పార్టీ నాయకులు చెరుకూరి రమేష్ , కొలకలూరి వెంకటేశ్వరరావు, రంగిశెట్టి శ్రీనివాసరావు, ఉమా తదితరులు పాల్గొన్నారు.

89శాతం మందికి పింఛన్లు పంపిణీ



మంగళగిరిలోని ఎయిమ్స్ ఆస్పత్రిలో మార్కపూడి భూషికి పింఛన్ అందజేస్తున్న నాని

కంచికచర్ల : వైఎస్సార్ ఆసరా పింఛన్ పంపిణీ కంచికచర్ల మండలంలో శరవేగంగా సాగుతోంది. రెండోరోజు శనివారం వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారికి పింఛన్ నగదును అందజేశారు. కంచికచర్ల మండలంలో 10,549 మంది పింఛన్‌దారులుండగా ఇప్పటివరకు 9,410 మందికి పింఛన్ నగదు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో అత్తోట దీప్తి తెలిపారు. మండలంలో 89.2శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని వివరించారు. మండలంలోని గండేపల్లికి చెందిన మార్కపూడి భూషి అనే వృద్ధుడు అనారోగ్యంతో బాధపడుతూ మంగళగిరిలోని ఎయిమ్స్ ఆసుపత్రిలో పదిహేను రోజులుగా చికిత్సపొందుతుండగా విషయం తెలుసుకున్న సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ నాని తనకు ఆరోగ్యం సహకరించకపోయినా తన బావను వెంటబెట్టుకుని బైక్‌పై మంగళగిరి వెళ్లి భూషికి పింఛన్‌ను అందజేశారు. దీంతో ఆ వృద్ధుడు ఎంతో ఆనందం వ్యక్తం చేశాడు. వెల్ఫేర్ అసిస్టెంట్‌తోపాటు సచివాలయ వ్యవస్థను అమల్లోకి తెచ్చిన సీఎం జగన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశాడు.

కళాకారులు సాంస్కృతిక వారధులు



గాయకులు డేవిడ్‌రాజు, శ్రీనివాసరెడ్డిని సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడకల్చరల్: కళాకారులు సాంస్కృతిక వారధులని రమణ కోకిల సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపకుడు సింగంపల్లి రమణ అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం సినీ సంగీత విభావరి, గాయకుడు కె.డేవిడ్‌రాజు, టి.శ్రీనివాసరెడ్డిలకు ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. రమణ మాట్లాడుతూ కళాకారుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. శాతవాహన కళాశాల కరస్పాండెంట్ నిడుమోలు రమాసత్యనారాయణ మాట్లాడుతూ.. దేశంలో కళాకారులకు కొదువలేదని, మరుగన పడిన కళాకారలకు వేదిక కల్పించాల్సిన అవసరముందన్నారు. ప్రభుత్వం కళాకారుల సంక్షేమం కోసం కృషి చేస్తోందని అభినందించారు. సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఈనెల 5నుంచి ముక్తేశ్వరుని కల్యాణోత్సవాలు

ముక్త్యాల(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న భవానీ ముక్తేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాలు ఈనెల ఐదోతేదీ నుంచి 13వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో జయప్రకాష్‌బాబు శనివారం తెలిపారు. ఐదోతేదీన నది ఒడ్డునున్న ముక్తేశ్వరాలయంలో సంప్రోక్షణ, స్వామివారిని పెండ్లి కుమారుని చేయడం, ఆరున విఘ్నేశ్వర పూజ, అంకురార్పణ, ఏడోతేదీన నిత్య హోమం, బలిహరణ, ఎనిమిదిన మహాశివరాత్రి సందర్భంగా రాత్రి 12 గంటలకు స్వామివారి కల్యాణం, అన్నాభిషేకం, తొమ్మిదిన బిందుతీర్థం, నిత్యహోమం, పారువేట ఉత్సవం, 10న పూర్ణాహుతి, వసంతసేవ, దొంగల తోపు ఉత్సవం, 11 నుంచి 13 వరకు పవళింపు సేవలతో కల్యాణోత్సోవాలు ముగుస్తామని వివరించారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు. ముగుస్తాయని తెలిపారు.

ఇంటింటికీ కొళాయి కనెక్షన్ ఏర్పాటే లక్ష్యం



మ్యాపింగ్ తయారీలో పాల్గొన్న సర్పంచి పద్మకుమారి, రామకృష్ణ, డ్వాక్రా మహిళలు

పెనుగంచిప్రోలు: ప్రతి ఇంటికి మంచినీటి కొళాయి కనెక్షన్ ఉండాలనేది ప్రభుత్వ లక్ష్యమని సర్పంచ్ వేల్పుల పద్మకుమారి అన్నారు.స్థానిక మోడల్ కాలనీలో జలజీవన్ మిషన్‌లో భాగంగా కమ్యూనిటీ కాంట్రాక్ట్ వ్యవస్థ ద్వారా పనులు చేపట్టేందుకు శనివారం ప్రజా అంచనా మ్యాపింగ్ తయారుచేశారు. ఈసందర్భంగా సర్పంచి మాట్లాడుతూ రూ.16 లక్షల జలజీవన్ మిషన్ నిధులతో కాలనీలో 1400 మీటర్లు పొడవున పైపులైన్ వేసి 382ఇళ్లకు కొళాయి కనెక్షన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. జలజీవన్ మిషన్ కోఆర్డినేటర్ జి.రామకృష్ణ మాట్లాడుతూ డ్వాక్రా మహిళలతో గ్రామ జలసంఘం ఏర్పాటు చేసి ప్రణాళిక తయారు చేసి రూ.5లక్షల లోపు పనులను వారి ద్వారా చేయిస్తామని వివరించారు. మండలంలో పెనుగంచిప్రోలు, ముచ్చింతాల, ముండ్లపాడు, కొణకంచి, గుమ్మడిదూర్రు గ్రామాల్లో మొదటగా ప్రణాళిక రూపొందిస్తున్నామని వివరించారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

సంతలో మౌలికవసతుల కల్పనకు చర్యలు

చిల్లకల్లు(జగ్గయ్యపేట):గ్రామంలో పేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో జరిగే సంతలో మౌలిక వసతులు కల్పిస్తామని ఏఎంసీ వైస్ చైర్మన్ గూడపాటి శేషయ్య తెలిపారు. చిల్లకల్లులో సంతను శనివారం ఆయన సందర్శించారు. బిల్లులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంతకు ప్రతి శనివారం రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన రైతులు వస్తుంటారని తెలిపారు. ప్రస్తుతం వేసవి కాలం కావటంతో మూగ జీవాల దాహార్తిని తీర్చేందుకు నీటి తొట్లిలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. యార్డుకు ఆదాయం వచ్చేలా సిబ్బంది పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి నరసింహారావు, సిబ్బంది రవి పాల్గొన్నారు.